క్లుప్తంగా

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల కారణంగా ఆరు రోజుల పాటు విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఈఈ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీ.క్యాంప్ సెక్షన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు 11 కేవీ ఫీడర్‌లో పనులు జరుగుతున్న కారణంగా కమలా నగర్, టెలికాం నగర్, గఫూర్ నగర్, ప్రశాంతి నగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, కిసాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, మాధవ నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

తాండ్రపాడు పరిధిలో కోతలు

టిడ్కో సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ పనులు జరుగుతున్న కారణంగా సోమవారం బి.తాండ్రపాడు పరిధిలో సరఫరా నిలిపివేయనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డీఈఈ వై.సుబ్బన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడ్కో ఇళ్ల కోసం ప్రభుత్వం కొత్తగా సబ్‌స్టేషన్ మంజూరు చేసిందని, దీని కోసం 33 కేవీ విద్యుత్ లైన్ లాగేందుకు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు తెలిపారు. బి.తాండ్రపాడుతో పాటు ప్రజానగర్, కాదంబరి టౌన్‌షిప్, టిడ్కో చుట్టు పక్కల ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి కౌశల్ యోజన పథకాన్ని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర అర్టిసన్ సెల్ కన్వీనర్ కొండముడి బంగారుబాబు సూచించారు. ఆదివారం కర్నూలు పర్యటనకు వచ్చిన ఆయన నగరంలోని వినాయక ఘాట్‌లో విశ్వ బ్రాహ్మణ, విశ్వ కర్మలను కలుసుకున్నారు. ప్రధానమంత్రి కౌశల్ యోజనను సద్వినియోగం చేసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అంతకుముందు పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో.. ఎలా లబ్ధి పొందాలో క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో సోమేశ్వర ఆచారి, దేవపూజ ధనుంజయాచారి, బ్రహ్మయ్య ఆచారి, శరబయ్య ఆచారి పాల్గొన్నారు.

జీఓలను రద్దు చేయాలి

కర్నూలు సిటీ: అశాస్త్రీయం, అసంబద్ధమైన జీఓలను రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం సలాంఖాన్ భవనంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ నూతన విద్యా విధానం వల్ల ప్రాథమిక విద్య నిర్వీర్యం అయ్యిందని, ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో రోజుకో జీఓ తీసుకొస్తున్నారని, దీని వల్ల గందరగోళం నెలకొందన్నారు. జీఓ ఎంఎస్ నంబరు 145 సవరించాలని కోరారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పని చేస్తున్న టీచర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 హెడ్ కింద జీతాలు చెల్లింపు, పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్దన్, ఆర్థిక కార్యదర్శి పి.శివప్రసాద్, గోవిందు, రామచంద్రగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 హోదా కల్పించాలి


మాట్లాడుతున్న సంధ్యారాణి

కర్నూలు(రూరల్): రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలకు గ్రేడ్-2 హోదా కల్పించాలని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ సంధ్యారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కే కే భవనంలో ఏఎన్ఎంల జిల్లా కమిటీ సమావేశం మహేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో అర్హత పొందిన వారిని గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2కు మార్చాలని, పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఎక్కడి నుంచైనా బయోమెట్రిక్ వేసే వెసులుబాటు కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, శ్రీగౌరి, దేవి, మేరమ్మ, పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదులు చేయటానికి వచ్చిన వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న టౌన్ సీఐపై చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి అల్లాబకాష్, జిల్లా కార్యవర్గసభ్యులు గణేష్‌లు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని జరిగిన వివిధ సంఘటనల్లో బాధితులు ఫిర్యాదు చేయటానికి పోలీస్‌స్టేషన్‌కు వస్తే కేసు నమోదు చేయకుండా ప్రత్యర్థులతో రాజీ కావాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందించి సీఐపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హాలహర్వి: మండలంలోని ఎల్ఎల్‌సీ కెనాల్ వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గుర్తించి పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మాచనూరు గ్రామానికి చెందిన దలవాయి విజయ కుమార్ ఆటో నం ఏపీ21వై 7570 లో 10 బాక్సులలో 960 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు అక్రమంగా తరలిస్తుండగా అరెస్టు చేసి, కేసు నమోదు చేశామన్నారు. హెడ్ కానిస్టేబుల్ గిడ్డయ్య గౌడు, గోవర్దన్, అయన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కె.మార్కాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన వారికి నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యం

జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కె.మార్కాపురంలో గ్రామ సచివాలయ భవనంతో పాటు బీటీ రోడ్డు, సీసీ రోడ్డులను ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ బోయ శారద ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసి స్థానికంగానే అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గ్రామంలో సుమారు 1.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. కోడుమూరు రోడ్డు నుంచి వయా కె.మార్కాపురం నుంచి పెద్దకొట్టాల వరకు కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మించామన్నారు. భక్తుల సౌకర్యార్థం కె.నాగలాపురం రోడ్డు నుంచి ఎల్లమ్మ గుడి వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, గ్రామ ప్రజల సౌకర్యార్థం కె.మార్కాపురం నుంచి పర్ల వెళ్లే రోడ్డును రూ.10 లక్షలతో నిర్మించామన్నారు. సర్పంచ్ గణ మద్దిలేటి, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీ, బీటీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఏర్పడి సామగ్రి మొత్తం కాలిపోగా కుటుంబసభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సహాయంగా నిత్యావసర సరుకులు, చీరలు, కొంత నగదు అందజేశారు. ఘటనను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయం అందేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

ఫీ'జులుం' నియంత్రించాలి

కర్నూలు(సెంట్రల్): కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. ఆదివారం తమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫీజుల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 53, 54 జీఓలను విడుదల చేసిందన్నారు. అయితే వాటిని అమలు చేయడంలో విద్యాశాఖాధికారులు విఫలమయ్యారని విమర్శించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 25 శాతం సీట్లను కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు అమలు చేయడంలేదని ఆమె ఆరోపించారు. కార్యక్రమంలో శేషమ్మ, కర్రెమ్మ, భాగ్యమ్మ, శంకరమ్మ,అంజనేయులు, నాగరాజు, పీటర్ పాల్గొన్నారు.

నేడు, రేపు అంగన్‌వాడీల ధర్నా

కర్నూలు(రూరల్): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద సోమ, మంగళవారాల్లో 36 గంటల మహాధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు నిర్మల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ సూచించారు. ఆయన ఆదివారం గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో పేదలకు దోమ తెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధులు సంభవిస్తాయన్నారు. వర్షాకాలంలో కలుషితమైన నీటిని తాగడం వల్ల టైఫాయిడ్, కామెర్లు, కలరా, గ్యాస్ట్రో ఎంటరైటిస్, అమీబియాసిస్ వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు.

ఫైసా ఖర్చులేకుండా ధ్రువపత్రాలు


వృద్ధురాలికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఒక్క పైసా కూడా ఖర్చు లేకుండా వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు టైపిస్ట్ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి పథకాలు అందించడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు కావలసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, ఫ్యామిలీ మెంబర్, మ్యారేజ్ సర్టిఫికెట్ తదితర 11 రకాల సేవలను దరఖాస్తు చేసుకున్న వెంటనే అందిస్తున్నామన్నారు. ప్రజలు వారి సచివాలయాల వద్ద నిర్వహిస్తున్న క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాం స్వామి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావు లేకుండా పథకాల అమలు



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన సంక్షేమ పథకాలు ఎలాంటి అవినీతికి తావు లేకుండా అమలవుతున్నాయని, అర్హులైన ప్రతిఒక్కరి చెంతకు చేరుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక 12వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఖడర్‌పురా, మైదానం వీధి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేసి, ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పథకాల పేరిట టీడీపీ నాయకులే దోచుకునేవారని, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పథకాలు పొందిన ప్రతిఒక్కరూ సక్రమంగా వినియోగించకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. వీటిని పొందేందుకు ఎవరి సిఫార్సులు అవసరం లేదని చెప్పారు. వార్డు నాయకులు నవీన్, హనీఫ్, మహబూబ్, షేక్షా, దావూద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల కోసమే ఉచిత వైద్య శిబిరం

కర్నూలు(రాజ్‌విహార్): పేదలకు సేవలందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు అహ్లెహదీస్ మర్కజ్ మసీదు కమిటీ నిర్వాహకులు ఉమర్ అన్నారు. ఆదివారం స్థానిక వడ్డెగేరిలోని మర్కజ్ మసీద్‌లో జెమ్ కేర్ కామినేని హాస్పిటల్‌తో కలిసి ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హాజరైన ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ మసీదు ఆవరణలో నాలుగు విభాగాల వైద్యులతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం హాస్పిటల్ ఎండీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చినట్లు చెప్పారు. ఆర్థిక స్థోమత లేని పేదలెందరో అనారోగ్యంతో బాధ పడుతున్నారని, అలాంటి వారి కోసం మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కీళ్లు, ఎముకల వ్యాధి నిపుణులు డాక్టర్ జీవీఎస్ రవిబాబు, స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ శృతి, మసీదు కమిటీ సభ్యులు అబ్దుల్ రజాక్, అన్వర్ పాల్గొన్నారు.

కురువలకు రాజకీయ ప్రాధాన్యతనివ్వాలి


యువజన సంఘం సమావేశంలో పాల్గొన్న నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజక వర్గాలను కురువలకు కేటాయించాలని ఆ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంటు కె.రామకృష్ణ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. నగరంలోని బీసీ భవన్‌లో ఆదివారం కురువ యువజన సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కురువల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ రాజకీయంగా అన్యాయానికి గురువుతున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కురువలకు టికెట్లు ఇస్తే రాజకీయాలకు అతీతంగా ఏకమై గెలిపించుకుంటామని ప్రకటించారు. కురువలకు రాజ కీయంగా న్యాయం చేయకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కురువలను రాజ కీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని, చట్టసభల్లోకి పంపడంలో అలసత్వం వహిస్తున్నాయని వాపోయారు. మండల స్థాయిలో నిర్వహించే కురువ యువజన సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మదాసి, మదారీ కురువ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకన్న, జిల్లా నేతలు వెంకటరాముడు, బండా శ్రీనివాసులు, కురువ యువ నాయకులు బత్తిన భరత్, వినోద్, కరణం యుగంధర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య తదితరులు

కర్నూలు(హాస్పిటల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. సీఎస్ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాజశేఖర్ విరాళంగా అందజేసిన ఈ విగ్రహాన్ని ఆదివారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల ప్రజలకు స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టమన్నారు. విగ్రహ ప్రదాత డాక్టర్ రాజశేఖర్, డీఐఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, ఏఓ డాక్టర్ నాగప్రసాద్, డెమో ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, బెన్నడిక్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

నందవరం : మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో శనివారం సాయంత్రం విద్యుత్ స్తంభాలు విరిగిపడి మహిళకు గాయాలైన విషయం తెలిసిందే. గాయపడిన మహిళ లలిత(38) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఆదివారం డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతి చెందిన లలితమ్మకు భర్త నాగిరెడ్డి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విద్యుత్ అధికారులు ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని 32 వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు సుధాకరప్ప కోరారు. శుక్రవారం నగరంలోని 32వ వార్డులో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సుధాకరప్ప మాట్లాడుతూ.. 2017లో రైతు బజార్‌కు శంకుస్థాపన చేసి నేటికి నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. మురుగు కాలువలు నిర్మించి దుర్వాసన నుంచి విముక్తి కలిగించాలన్నారు. సామూహిక మరుగుదొడ్డి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, ఆ స్థానంలో కొత్తది నిర్మించాలన్నారు. వివిధ కారణాలరీత్యా తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలని కోరారు. సీపీఎం నాయకులు విజయ్ కుమార్, రామాంజనేయులు, మధు, శ్రావణ్, ఆనంద్, దావీద్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): నగరంలోని 1, 2 వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ షరీఫ్ కోరారు. ఆదివారం నగరంలోని 1, 2వ వార్డులో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ.. వార్డులోని డ్రైనేజీలు పూడికతో నిండి మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో దోమలకు, పందులకు ఆవాసా కేంద్రంగా మారిందన్నారు. మురుగు కాలువలు శుభ్రం చేయంతో పాటు లేని చోట కొత్తవి నిర్మించాలని కోరారు. సీపీఎం నాయకులు నూర్‌బాషా, రాజు, అబ్దుల్లా, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నెలరోజులకే దెబ్బతిన్న మ్యాన్ హోల్


సి.క్యాంపు వద్ద దెబ్బతిన్న మ్యాన్‌హోల్

కర్నూలు (టౌన్): అత్యంత రద్దీగా ఉండే సి.క్యాంపు, మద్దూర్‌నగర్ రోడ్డులో ఇటీవల దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌ను పునరుద్ధరించారు. స్థానిక సి.క్యాంపు చర్చి ఎదురుగా ఉన్న ఈ మ్యాన్‌హోల్‌కు ఇటీవల నూతనంగా గ్రిల్ ఏర్పాటు చేశారు. నెల రోజుల క్రితం నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు ఈ గ్రిల్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కువ ట్రాఫిక్ ఉండే ఈ రహదారిలో నెల రోజులుగా బాగానే నడిచింది. అయితే ఇప్పుడు అదికాస్తా కుంగిపోయింది. సిమెంట్ పెచ్చులు ఊడి కంకర తేలింది. మళ్లీ పాత పరిస్థితి పునరావృతం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారికి మధ్యలో ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. మరోసారి ఈ మ్యాన్ హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డీపీడీఎంకు సత్కారం


డీపీడీఎం భరద్వాజ శర్మను సత్కరిస్తున్న పసుపల పీఏసీఎస్ చైర్మన్, సీఈఓలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జిల్లా ప్యాక్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ (డీపీడీఎం)గా పనిచేస్తూ బదిలీ అయిన భరద్వాజ శర్మను కర్నూలు మండలం పసుపల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ శేషారెడ్డి, సీఈఓ మురళీధర్‌చౌదరి ఘనంగా సత్కరించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. పసుపల పీఏసీఎస్ అభివృద్ధికి భరద్వాజశర్మ చూపిన చొరవ ఎన్నటికీ మరువలేనిదన్నారు.

చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి


హాజరైన కురువ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కర్నూలుకు రప్పించి ఘనంగా సత్కరించేందుకు జిల్లాలోని కురువలందరు కలసికట్టుగా వ్యవహరించాలని జిల్లా కురువ, కురుబ, మదారి, మదాసి కురువల సంఘం అధ్యక్షుడు దేవేంద్రప్ప పిలుపునిచ్చారు. ఆదివారం పంచలింగాల ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సన్మానంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్‌గా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను లక్ష మంది కురువల సమక్షంలో పెద్ద ఎత్తున సత్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చట్టసభల్లో కురువలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలని కోరారు. జెడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కురువలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లక్ష్మీప్రసాద్, నాగరాజు, కరువ సంఘం నేతలు పాల సుంకన్న, బత్తిన లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.